నవతెలంగాణ
మనసున్న తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | డిసెంబర్ 30, 2023 | www.navatelangana.com

స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను మరింత విస్తృతం చేసేలా కృషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను మరింత విస్తృతం చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ కంచనవల్లి రత్నకర్ అన్నారు. శుక్రవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ఆయన హాజరై స్కౌట్స్ అండ్ గైడ్స్ పని తీరు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కరుణకర్ మాట్లాడుతూ జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను మరింత విస్తృతం చేయడంతో పాటు క్యాంపులను నిర్వహించేలా ప్రణాళికలు చేశామని పేర్కొన్నారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో తాము చేసిన పనుల రికార్డులను ప్రదర్శించాలన్నారు. రికార్డులుంటే భవిష్యత్తు తరాలకు ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా పట్టణంలో ఉన్న స్థలంలో భవన నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, దేవేందర్ పటాస్కర్ పాల్గొన్నారు.

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ

దిలావర్‌పూర్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల పథకానికి లబ్దిదారులను ఎంపిక చేసేందుకు మండలంలోని సిర్గాపూర్, న్యూలోలం, బన్సపల్లి గ్రామాల్లో శుక్రవారం పంచాయతీల ఆవరణలలో ప్రజాపాలన సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిణి ప్రశాంతి మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారులను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, తహసీల్దార్ సరిత, ఎంపిడిఓ మోహన్, ఎంపిఓ అజీజ్‌ఖాన్, సర్పంచులు ఇట్టడి గంగారెడ్డి, ఒడ్నం సవితకృష్ణ, పోల పద్మ విక్రమ్, ఆర్ఐ సంతోష్, ఎస్ఐ యాసిత్ అరాఫత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



భార్యను చితకబాదిన కానిస్టేబుల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భార్యను పోలీస్ కానిస్టేబుల్ చితకబాదిన సంఘటన జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో చోటు చేసుకుంది. బాధితురాలు మౌనిక తెలిపిన వివరాల ప్రకారం ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మాధవరావుతో మౌనిక వివాహం మూడు సంవత్సరాల క్రితం జరిగింది. ప్రస్తుతం బాబు ఉన్నాడు. వివాహ సమయంలో రూ.20లక్షల కట్నం ఇచ్చారు. తాజాగా కొడుకు పుట్టి వెంట్రుకల కోసం తన పుట్టింటి నుండి రూ.2లక్షలు తీసుకురావాలని కొంతకాలంగా గొడవ పడుతున్నాడు. దీంతో పాటు గ్రూప్స్ కోసం ఆరు నెలలు లీవ్ పెట్టానని, జీతం లేదని ఇంటి ఖర్చులు కూడా పుట్టింటి నుండి తీసుకురావాలని మాధవ్‌రావు వేధిస్తున్నాడు. ఇదే క్రమంలో జరిగిన గొడవలో ఇనుపరాడ్‌తో తనను చితకబాదినట్లు మౌనిక తెలిపింది. గాయపడ్డ మౌనికను బంధువులు ఆసుపత్రిలో చేర్చారు. మాధవరావుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-కెరమెరి

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని కోట గ్రామంలో గంజాయి కలిగి ఉన్నాడని నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై జి విజయకుమార్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. కోట గ్రామానికి చెందిన ధనరాజ్(37) వద్ద బ్యాగును తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకుని గెజిటెడ్ అధికారి సమక్షంలో పంచనామా నిర్వహించారు. గంజాయి 6 కేజీల 100 గ్రాములుగా కాగా, దాని విలువ సుమారు రూ.1,52050గా నిర్ధారించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడి, యువత పెడదారిపడుతోందని తెలిపారు. ఇంటి పరిసరాల్లో గంజాయి పెంచినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిషేధించబడిన మాదకద్రవ్యాలు, గంజాయి క్రయ, విక్రయాలు చేపట్టిన, వినియోగించిన సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎస్సై జి.విజయ్‌కుమార్ ఉన్నారు.

రెండో రోజూ ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని కన్నర్‌గావ్, కోమటిగూడ, కిర్డీ, నవెదరి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారమూ దరఖాస్తులు స్వీకరించామని ఎంపీడీఓ శివకుమార్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి కుటుంబం ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనవరి 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, లబ్ధిదారులకు కావాల్సిన దరఖాస్తులను గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రావణ్, విద్యుత్ శాఖ సిబ్బంది సౌమ్యశ్రీ పాల్గొన్నారు.

ప్రయివేట్ వైద్యుని గెజిటెడ్ సంతకాల నిలిపివేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో ప్రయివేట్ వైద్యుడు గెజిటెడ్ సంతకాలు చేస్తూ డబ్బులు దండుకుంటున్నట్లు 'నవతెలంగాణ'లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. ప్రయివేట్ నర్సింగ్‌హోం నడుపుకుంటున్న వైద్యుడు పలు సర్టిఫికెట్‌ల కోసం చేసుకునే దరఖాస్తు ఫారాలపై కొన్ని సంవత్సరాలుగా గెజిటెడ్ సంతకాలు చేస్తున్నాడు. దీనిపై తహసీల్దార్ కిరణ్ స్పందించారు. ఎలాంటి అర్హత లేకున్నా గెజిటెడ్ సంతకాలు చేస్తున్నట్లు తాను గుర్తించానని, ఆ వైద్యునికి ఫోన్ చేయగా తాను స్థానికంగా లేనని సమాధానం ఇచ్చాడని తహసీల్దార్ కిరణ్ తెలిపారు. తాను గతంలో గెజిటెడ్ హోదాలో పని చేశానని, దానినే కంటిన్యూ చేస్తున్నట్లు వైద్యుడు తెలుపగా తాను మందలించినట్లు తెలిపారు. ఇక ముందు ఇది కంటిన్యూ అయితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆ వైద్యున్ని హెచ్చరించి వదిలేసినట్లు తెలిపారు. తాను చర్యలు తీసుకుంటున్న క్రమంలోనే సహ చట్టం కార్యకర్త అజీమ్ ఫిర్యాదు చేశాడని తహసీల్దార్ వివరించారు.

ప్రజలందరూ దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-బేల

ప్రజలందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ వనిత ఠాక్రె అన్నారు. శుక్రవారం మండలంలోని మణియార్‌పూర్ గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 పథకాలకు సంబంధించిన దరఖాస్తు చేసుకోవాలన్నారు. తప్పులు దొర్లకుండా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సవాయ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి నీతరాణి, సర్పంచ్ వాడ్కర్ తేజరావ్, నాయకులు గంభీర్ ఠాక్రె పాల్గొన్నారు.

హత్యలు పెరిగాయ్..ప్రమాదాలు తగ్గాయ్..!

- పెరిగిన ఆర్థిక నేరాలు..గంజాయి కేసులు
- గతేడాదితో పోల్చితే వివిధ కేసుల్లో హెచ్చుతగ్గులు
- వార్షిక నేర నివేదిక విడుదల చేసిన పోలీసుశాఖ

ఉమ్మడి జిల్లాలో హత్యల విష సంస్కృతి పెరగడం ఆందోళనకరంగా మారుతోంది. ఆయా కుటుంబాలు, వివిధ విషయాల్లో ఇరుపక్షాల మధ్య ఘర్షణలు హత్యలకు దారితీస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా మరణించిన వ్యక్తుల కుటుంబాలతో పాటు హత్యకేసులో జైలుపాలైన వారి కుటుంబాల్లోనూ విషాదం నింపుతోంది. మరోపక్క గతేడాది పోల్చితే రోడ్డు ప్రమాదాలు తగ్గిపోవడం శుభపరిణామంగా మారుతోంది. పోలీసుశాఖ చేపట్టిన అవగాహన, వివిధ రకాల నియంత్రణ చర్యల కారణంగా రోడ్డు ప్రమాదాలు తగ్గినట్లు తెలుస్తోంది. ఇక ఆర్థిక నేరాలు పెరగడం ఆందోళనకరంగా మారగా.. ఇదే మాదిరి జిల్లాలో గంజాయి కేసులు కూడా పెరుగుతుండటం మాదక ద్రవ్యాల వినియోగం ఏ రీతిలో సాగుతుందో తెలియజేస్తోంది. ముఖ్యంగా మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టగా.. బాలికలపై మాత్రం నేరాలు కొనసాగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలో ఈ ఏడాది నమోదైన వివిధ రకాల కేసుల వివరాలను పోలీసుశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో కిందేడాదితో పోల్చితే వివిధ రకాల నేరాల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. కొన్ని రకాల నేరాలు పెరిగితే..మరికొన్నింటిలో తగ్గుముఖం పట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా ఉమ్మడి మూడు జిల్లాల్లోనూ గతేడాదితో పోల్చితే హత్యలు పెరిగాయి. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 2022లో 3306 వివిధ రకాల కేసులు నమోదు కాగా.. 2023లో వాటి సంఖ్య 4050కి పెరిగింది. గతేడాది కంటే నేరాల సంఖ్య పెరగడం గమనార్హం. 2022లో 11 హత్యలు చోటుచేసుకోగా.. 2023 వచ్చే సరికి వీటి సంఖ్య 18కి చేరింది. ఆర్థిక నేరాలు సైతం పెరిగాయి. కిందటేడాది వీటి సంఖ్య 188 నమోదు కాగా 2023లో 264కి చేరాయి. ముఖ్యంగా మహిళలపై జరిగిన నేరాల్లో 2022లో 329 నమోదు కాగా 2023 ఏడాదిలో 309 మాత్రమే నమోదయ్యాయి. మహిళలపై నేరాల సంఖ్య తగ్గిపోవడం మంచి పరిణామంగా భావించినా బాలికలపై మాత్రం పెరగడం ఆందోళనకరంగా మారుతోంది. కిందటేడాది 45పోక్సో కేసులు నమోదు కాగా 2023కి వచ్చే సరికి 49నమోదు కావడం గమనార్హం. ప్రతి ఏటా వీటి సంఖ్య పెరగడం పిల్లల తల్లిదండ్రులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో ఎస్సీ,ఎస్టీ కేసులు గతేడాది కంటే కొంత తగ్గిపోయాయి. మరోపక్క ప్రభుత్వం గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని భావిస్తున్న క్రమంలో జిల్లా పోలీసులు సైతం దీనిపై దృష్టిసారించారు. వివిధ చోట్ల నిర్వహించిన దాడుల్లో గంజాయి లభించడంతో గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా కేసులు నమోదు చేశారు. ఇక డ్రంకన్ డ్రైవ్ కేసులు సైతం గతేడాది కంటే పెరగడం గమనార్హం.

నిర్మల్ జిల్లాలో తగ్గిన నేరాలు

నిర్మల్ జిల్లాలో గతేడాది కంటే నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టినా..వివిధ నేరాల పరంపర కొనసాగడం ఆందోళనకరంగా మారుతోంది. మొత్తం నేరాల్లో 2022లో 3120 నమోదు కాగా 2023లో మాత్రం 2967 నమోదయ్యాయి. గతేడాది కంటే స్వల్పంగా నేరాల సంఖ్య తగ్గింది. హత్య కేసులు తగ్గిపోగా.. హత్యాచారం కేసులు మాత్రం కిందటేడాది మాదిరిగానే నమోదయ్యాయి. నిర్మల్ జిల్లాలోనూ రోడ్డు ప్రమాదాలు తగ్గిపోయాయి. మరోపక్క, మహిళలపై నేరాలు గతేడాది కంటే పెరిగిపోవడం ఆందోళనకరంగా మారుతోంది. గతేడాది మహిళలపై వేధింపులు, హత్యలు, వరకట్నం తదితర కేసులు 236 నమోదు కాగా ఈ ఏడాది వాటి సంఖ్య 309కి చేరుకున్నాయి. ఈ జిల్లాలో మిస్సింగ్ కేసులు అధికంగా నమోదయ్యాయి. 2022లో 215 కేసులు నమోదు కాగా 2023 ఏడాదిలో వీటి సంఖ్య 219కి చేరుకున్నాయి. గతేడాది మాదిరిగానే జిల్లాలో అదృశ్యం కేసులు నమోదు కావడం ఆందోళనకరంగా మారింది.



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, పోలీస్ అధికారులు(ఫైల్)



ఇటీవల ఇచ్చోడలో హత్యకు గురైన యువకుడు

ఆసిఫాబాద్ జిల్లాలో పెరిగిన హత్యలు

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ హత్య కేసులు పెరగడం గమనార్హం. గతేడాది కంటే 35శాతం హత్య కేసులు పెరగడం ఆందోళనకరంగా మారింది. వీటితో పాటు 95ఆస్తి సంబంధిత నేరాలు, మరో 4 నేర పూరిత నరహత్యలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా 21 కిడ్నాప్ కేసులు, మరో 22 హత్యాచార కేసులు నమోదయ్యాయి. మైనర్ బాలికలపై నేరాలకు గాను 17పోక్సో కేసులు నమోదు చేశారు. మరోపక్క మహిళలపై జరిగిన అఘాయిత్యాల కేసులు 154 నమోదయ్యాయి. గతేడాదితో పోల్చితే అత్యాచారం, దొమ్మి కేసులు, మోసపూరిత నేరాలు, గజాయి కేసులు, సైబర్ నేరాలు మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించి నేరాలు తగ్గుముఖం పట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

అభయహస్తం అవస్థలు..!

- అధార్ కేంద్రాల వద్ద క్యూ
- రూ.20 నుంచి రూ.30కి దరఖాస్తుల విక్రయం

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఐదు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ కార్డు కీలకం. ఈ కార్డులో మార్పులు చేర్పులు, నూతన కార్డుల కొరకు ఆధార్ కేంద్రాల వద్ద ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. సంక్షేమ పథకాల మంజూరుకు గ్రామసభల్లో అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్ తప్పనిసరిగా మారింది. మండలంలోని నజ్రూల్‌నగర్ మార్కెట్‌లోని ఆధార్ కేంద్రానికి పరుగులు తీస్తున్నారు. గురు, శుక్రవారాల్లో ఆధార్ కేంద్రానికి నెట్‌వర్క్ సక్రమంగా లేనందున సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన జనం తీవ్ర అవస్థలకు గురయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి పిల్లాపాపలతో వచ్చిన జనం నానా అవస్థలు ఎదుర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి నెట్‌వర్క్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మరోవైపు దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందజేయాల్సి ఉండగా మండలంలోని ఉమ్మడి నజ్రూల్‌నగర్ పంచాయతీలో ఇందుకు భిన్నంగా కొనసాగుతోంది. ఈ పంచాయతీలోని మీ సేవా కేంద్రాల నిర్వహకులు ఒక్కో దరఖాస్తుకు రూ.20 నుంచి రూ.30 వసూలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మీ సేవా కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా ప్రతి దానికి ముక్కుపిండి వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు కనీసం విచారణ చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి. సంక్షేమ పథకాలు పొందటానికి ప్రజానీకం ఆరాటపడుతున్న నేపథ్యంలో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు దరఖాస్తులు విక్రయంతో సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మీ సేవా కేంద్రాల్లో చోటు చేసుకుంటున్న అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడమే లక్ష్యం



నవతెలంగాణ -ఆదిలాబాద్ అర్బన్

ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలందరికీ అందడమే లక్ష్యంగా వారి పక్షాన ప్రశ్నించే గొంతుగా నిలుస్తామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వెంకట్రావుపేట, శాంతినగర్, కైలాస్‌నగర్‌లో జరుగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రాలను పరిశీలించారు. ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి సిబ్బందికి పలు సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే విధంగా బీఆర్ఎస్ ప్రజల తరపున ప్రశ్నిస్తుందని పేర్కొన్నారు. పట్టణంలోని 49 వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు అందుబాటులో ఉండి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తున్నారన్నారు. రైతుబంధు విషయంలో అధికారులు, మంత్రులు తలొక రీతిన చెబుతుండడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వివరణ ఇవ్వాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామ్‌కుమార్, సూర్యభాను, సునీల్, సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తాం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మామడ మండలంలోని నల్దుర్తి గ్రామంలో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అభయహస్తం కింద దరఖాస్తు చేసుకునే వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అన్ని పథకాలకు ఒకే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందన్నారు. వచ్చే ఏడాది జనవరి 6వరకు దరఖాస్తులు అందజేయవచ్చని పేర్కొన్నారు. తొమ్మిదేళ్లలో ఒక్కరికి కూడా రేషన్‌కార్డు ఇవ్వని ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మామడ ఎంపీపీ జైసింగ్, జెడ్పీటీసీ సోనియా సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రమణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పడాల శ్రీనివాస్, పడాల భీమేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-బోథ్

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పంద్రం సుగుణ అన్నారు. మండలంలోని పట్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్, జన ఆరోగ్య యోజన, జన్ దన్ యోజన, పిఎం సురక్ష బీమా జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ స్వానిధి యోజన తదితర పథకాలపై గ్రామస్తులకు ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు రవికుమార్, నరేష్, పంచాయతీ కార్యదర్శి మిథున్, డాక్టర్ ప్రియాంక, ఏఎన్ఎం కవిత, అంగన్వాడీ సుశీల, శోభ, ఐకెపి శ్రీనివాస్, బిపిఎం అప్క శ్రీనివాస్, ఆశా వర్కర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని పరిశీలించిన కాంగ్రెస్ అధ్యక్షులు

నవతెలంగాణ -కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో శనివారం నిర్వహించే కాకా వెంకటస్వామి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాట్లలో భాగంగా మైదానాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయి టోర్నమెంట్ శనివారం ఉదయం 11:30గంటలకు ప్రారంభిస్తామని, క్రీడాకారులు, మండల నాయకులు అందరూ హాజరై విజయవంతం చేయాలని రత్నం ప్రదీప్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, ముత్యంపల్లి గ్రామ అధ్యక్షులు దారవేని రాజయ్య, యువ నాయకులు, యాదవ సంఘ జిల్లా అధ్యక్షులు పుర్ర కుమారస్వామి, మారం రాజ్‌కుమార్, శ్రావణ్, దాసరి లింగయ్య సురేష్, శ్రీకాంత్, జాడి శివ పాల్గొన్నారు.



విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ క్రీడల ఆసక్తి చూపాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ఇందులో భాగంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాఠశాలకు క్రీడా స్థలాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా ఇచ్చోడ నుంచి బజార్‌హత్నూర్ ఆర్ అండ్ బి రోడ్డు నుంచి మోడలల్ స్కూల్ మీదుగా కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రహదారి పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆర్ అండ్ బి రోడ్డు ఐటీడీఏ నిధులు రూ.కోటి మంజూరైనట్టు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరలో పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భైంసా ఎంపీపీ పదవికి రాజీనామా

నవతెలంగాణ-భైంసా

భైంసా ఎంపీపీ కల్పన తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం ఆమె వెల్లడించారు. రాజీనామా ప్రతిని జెడ్పీ సీఈఓ అందజేశారు. నిన్న వైస్ ఎంపీపీ నేడు ఎంపీపీ రాజీనామాలు చేయడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇన్ని రోజులు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నవారు బీఆర్ఎస్ పార్టీకి సైతం వారు రాజీనామా చేశారు. అప్పట్లో ఒకే ఒక్క స్థానంతో బీఆర్ఎస్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం ఎమ్మెల్యే రామారావు పటేల్ గెలువడంతో భైంసా మండలంలో రాజకీయ సమీకరణలు మారిపోతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఎంపీటీసీలు అంతా బీజేపీ పక్షాన చేరుతుండటంతో ఇక ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాన్ని త్వరలో బీజేపీ కైవసం చేసుకోనుంది. దీంతో భైంసా మండల రాజకీయాల్లో ఇదే చర్చ కొనసాగుతుంది. ముధోల్ రాజకీయాల్లో స్థానిక సంస్థలన్నీ తన వైపు చేసుకునేలా ఎమ్మెల్యే రామారావు పటేల్ చక్రం తిప్పుతున్నారని చర్చ కొనసాగుతోంది.

దరఖాస్తుల స్వీకరణలో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

- ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిణి ఎం.ప్రశాంతి



ఆదిలాబాద్ రూరల్‌లో..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్, ఆదిలాబాద్ రూరల్

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిణి ఎం.ప్రశాంతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ద్వారకానగర్, రాణిసతిజీ కాలనీ, భుక్తాపూర్, మావల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్‌లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను జనవరి 6వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఒకే కుటుంబంలోని సభ్యులు అందరికీ రేషన్‌కార్డు లేకపోయినా వారి తల్లిదండ్రుల రేషన్ కార్డులో నమోదైవున్నా పేర్లను బట్టి, తల్లిదండ్రుల రేషన్ కార్డు నెంబర్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల మంచి స్పందన వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను పూరించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అవసరమైన సలహాలు, సూచనలు అధికారులు అందించాలని సూచించారు. దరఖాస్తుదారుడు దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ ప్రతులను జత చేయాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు, అందే విధంగా పనిచేయడమే ప్రభుత్వ అధికారుల లక్ష్యమని తెలిపారు. దరఖాస్తుదారులకు తప్పనిసరిగా రశీదు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మున్సిపల్ కమీషనర్ శైలజ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నార్నూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజు అదికారులు దరఖాస్తులు స్వీకరించారు. నార్నూర్ మండలంలోని బేతల్‌గూడ, మరపగూడ, నాగల్‌కొండ, భీంపూర్ గ్రామపంచాయతీలో అదేవిధంగా గాదిగూడ మండలంలోని అర్జుని, సాంగ్వి బొడ్డిగూడ(జి), రూపాపూర్ గ్రామపంచాయతీలో దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన వారి దరఖాస్తును స్పెషల్ అదికారులు డీఎల్పీఓ భిక్షపతిగౌడ్, ఎంపీడీఓలు కావల రమేష్, రామేశ్వర్‌లు పరిశీలించారు. అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాల కోసం గ్రామ పంచాయతీలో ధరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓలు గణేష్ రాథోడ్, రమేష్, ఏఈఓలు శుభాని, శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీఓ గంగాసింగ్, సాయి ప్రసాద్, ఏఈఓ సాయికృష్ణ కార్యదర్శులు శ్రీనివాస్, లవకుమార్, ఆత్రం శంకర్, కే.రవి కుమార్, సునీల్, నాగోరావ్, రజినీకాంత్ వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

లక్ష్మణచాంద : ప్రజాపాలన కార్యక్రమం ద్వారా 5 పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేఖర్ అన్నారు. మండల కేంద్రం, చింతల్ చాంద, కంజర్, వాడ్యాలతండా గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి శ్యామ్‌రావు రాథోడ్, ఎంపీపీ అడ్వాల పద్మ,



లక్ష్మణచాందలో..

జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు అందరూ ఎలాంటి తప్పులు దొర్లకుండా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీఓ నసీరుద్దీన్, సర్పంచ్లు ముత్యంరెడ్డి, రాజమణి, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు విక్రమ్ రాజ్, రజని, మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, ఆశా సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, మండల పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరంభించిన ప్రజాపాలనలో భాగంగా శుక్రవారం మండలంలోని మర్కగూడ, బిక్కుతండ, మెండాపల్లి తదితర గ్రామాల్లో ప్రజాపాలనను నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఆర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అడేపు సంతోష్ సర్పంచ్ ఆడే విజయ, ప్రజలు పాల్గొన్నారు.

కుభీర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలను అమలు చేసేందుకు గ్రామంలో ఉన్న లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన ప్రజాపాలన శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. మండలంలోని కిషన్‌నాయక్ తండా, మలేగాం, సాంగ్వి, గొడిసెరా, గ్రామంలో అధికారులు నాయకులతో కలిసి గ్రామస్తుల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ పార్టీ నాయకులతో కలిసి 6 గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూము లక్ష్మీ బాయి, రాజేశ్వర్ సునీత, గణపతి, మహిపాల్‌రెడ్డి, సంతోష్, శ్రావణ్ ఆయా గ్రామాల అధికారులు చంద్రకాంత్, ఎంపీడీఓ లింబాద్రి, తహసీల్దార్ సోము, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగు : ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమాకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని పల్సి(బి)తో పాటు ఆయా గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అమలుపరుస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు మండల ప్రజలు తరలివచ్చి ప్రజాపాలనలో తమ సమస్యలను విన్నవించి, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న దరఖాస్తు ఫారాలను పూర్తిచేసి ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో ముందుగా ముఖ్యమంత్రి సందేశం చదివిన అనంతరం గ్రామస్తులకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. ప్రజాపాలన కార్యక్రమాలలో ప్రత్యేక అధికారి మహావీర్, తహసీల్దార్ రాజమోహన్, సర్పంచ్ అంగూర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీఓ దిలీప్ కుమార్, సూపరింటెండెంట్ అజీమ్, ఆయా గ్రామాల సర్పంచులు ప్రజలు పాల్గొన్నారు.



తలమడుగులో..

ప్రజాపాలన సిబ్బందికి భోజనం కరువు

- ఆకలితోనే అధికారుల విధులు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం అధికారులకు, సదరు శాఖల సిబ్బందికి ఆకలి మంటను రేపుతోంది. గ్రామాల్లో, పట్టణాల్లోని వార్డుల్లో భోజనాలు సమకూర్చే వారు లేని దుస్థితి నెలకొంది. ఉదయం 8 గంటలకు అధికారులు కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. సదరు అధికారులు ఉదయం 7 గంటలకు ఇంట్లో నుంచి వెళ్తేగాని సంబంధిత గ్రామానికి సమయానికి చేరుకునే అవకాశం ఉండదు. ఆ సమయంలో టిఫిన్ బాక్సు తయారికి సమయం సరిడక సిబ్బంధి బాక్సను వెంట తీసుకెళ్లలేని స్థితిలో విధుల్లో పాల్గొంటున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో రెవెన్యూ, మండల పరిషత్, ఐసీడీఎస్, మెడికల్ సిబ్బంది పాల్గొని విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మద్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల సమయం దాకా సదరు సిబ్బందికి బ్రేక్ టైం అవకాశం ఇచ్చింది. ఆసమయంలో సదరు సిబ్బంది భోజనాలు చేయాలని ప్రభుత్వం సూచించింది. అంతవరకు బాగానే ఉన్నా మండల కేంద్రాల నుంచి 10, 20కిమీ దూరంలో ఉండే గ్రామాలు ఎన్నోఉన్నాయి. అలాంటి గ్రామాల నుంచి విధుల్లో పాల్గొన్న సిబ్బంది రెండు గంటల లోపు వారు నివాసం ఉండే ప్రాంతానికి వెళ్లి భోజనం చేసి తిరిగి రావడం వీలుపడే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో ప్రజాపాలనలో పాల్గొంటున్న ఆయా శాఖల సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకలితో ఉపావాసం ఉంటున్నారు. స్థానిక మున్సిపాలటీలోను అదే పరిస్థితి ఉంది. కనీసం చాయ్ కూడా ఏర్పాటు చేసేవారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షుగర్, బీపీ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారి పరిస్థితి మరీ వర్ణణాతీతం. తమ పరిస్థితిని ఎవరికి చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నామని మనోవేదన చెందుతున్నారు. ప్రభుత్వం భోజన సౌకర్యం కల్పించకపోవడం అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నిధులు ఇస్తే భోజన వసతి కల్పించే వారమని ఓ అధికారి పేర్కొన్నారు.

కలిసి కట్టుగా పని చేస్తేనే అభివృద్ధి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందులో భాగంగా మండల అధికారులు తమ తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించించాలని అన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించాలని, బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా పనిచేసి, మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ప్రతి మండల సర్వసభ్య సమావేశానికి డివిజన్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే హాజరైతే మండల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. గ్రామాల్లో రోడ్లు, శ్మశాన వాటికల వద్ద రోడ్లు, మిషన్ భగీరథ నీటిపై పలువురు ఎంపీటీసీలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. మండలంలోని గులాబ్‌తండా, కిన్నరపల్లి, దిగ్నూర్ తదితర గ్రామాల్లో ఫ్లోరైడ్ వాటర్ ఉండటంతో నీటిని తాగడానికి ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి వాటర్ శుద్ధీకరణ ప్లాంటును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటిసరిగా మండలానికి వచ్చిన సంద్భంగా మండల ఎంపీటీసీలు, సర్పంచులు, పీఏసీఎస్ సిబ్బంది శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హజాడే జయశ్రీ, జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎంపీడీఓ చౌహాన్ రాధా, మండల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీమార్గమే రాజమార్గమని, పరస్పర ఒప్పందంతో కేసులను పరిష్కరించుకోవాలని, లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయస్థానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30 శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో దాదాపు 9 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సాక్ష్యులను విచారణ తీర్పు ఇవ్వడానికి చాలా సమయం పడుతోందని, దానివల్ల కేసుల సంఖ్య పెరిగిపోతోందని అన్నారు. కక్షిదారులు పరస్పర ఒప్పందానికి వచ్చి సాధ్యమైనంత వరకు లోక్‌అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. దాని వల్ల సమయం ఆదా కావడంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. రెండు నెలల కొకసారి లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, కానీ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఇటీవల కాలంలో నిర్వహించలేకపోయామని వెల్లడించారు. పరిష్కరించుకోదగ్గ కేసులను లోక్‌అదాలత్‌కు వచ్చి ఎలాంటి అప్పీల్ లేకుండా కేసుల నుంచి బయటపడాలని పేర్కొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి పడాల భూమన్నను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే పాయల శంకర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే హోదాలో పడాల భూమన్నను కలిసి వారికి శాలువాతో సన్మానం చేశారు. వారితో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు లాలా మున్నా, కౌన్సిలర్లు ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నారై అగ్రిటెక్ సూర్య కంది క్షేత్ర ప్రదర్శన దినోత్సవం



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రానికి చెందిన రైతు కళ్లెం వినాయక్‌రెడ్డి చేనులో శుక్రవారం ఎన్నారై అగ్రిటెక్ సూర్య కందిక్షేత్ర ప్రదర్శన దినోత్సవాన్ని కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ రీజనల్ మేనేజర్ రవీంద్ర మాట్లాడుతూ జిల్లాలో తొలకరి వర్షంలోనే ఎన్నారై అగ్రిటెక్ వారి కంపెనీ విత్తనాలు వాడినట్లయితే రైతులకు అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. మండల కేంద్రానికి చెందిన రైతు వినాయక్‌రెడ్డి చేనులో కంది పంట సాగు చేయగా ఏడు నుంచి ఎనిమిది అడుగులు ఎత్తు పెరిగి పూత ఖాతా అధిక శాతం కంది పంట పెరగడంతో కంది పంట విరగ కాసినట్లు తెలిపారు. అదేవిధంగా చీడ పీడల నివారణకు తట్టుకొని తక్కువ మోతాదు మందులతో కంది పంట సాగు చేయడం జరిగిందన్నారు. చుట్టుపక్క గ్రామాల రైతులకు ఎన్నారై అగ్రిటెక్ కంపెనీ విత్తనాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వెంకట్‌రామ్, సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి, రైతులు పిడుగు సంజీవరెడ్డి, కంపెనీ సిబ్బంది రాజ్ కుమార్, వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మాధవరావు రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని డీఎంకు వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ బస్సులు మహిళలతోనే బస్సు నిండిపోతుంది. దీంతో సకాలంలో విద్యార్థులు విద్యాసంస్థలకు చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ అన్నారు. శుక్రవారం బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ ఆర్టీసీ డీఎం కల్పనను కలిసి వినతిపత్రం అందజేశారు. బస్సుల రద్దీ వల్ల విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. సమయానికి రాకపోవడం వల్ల కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. సామర్థ్యానికి మించి ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. విద్యాసంస్థల సమయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరుణ్, మహేష్, ఉదయ్, నిఖిల్ ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-నిర్మల్

అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ రద్దు చేసి, ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి నేరుగా కార్మికుల అకౌంట్‌లోనే ప్రతి నెల వేతనాలను వేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల శ్రమ దోపిడికి గురవుతున్నారన్నారు. నెలల తరబడి ఏఎన్ఎం కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెల 1తేదీ నుంచి 5వ తేదీలోపు వేతనాలు వేసే విధంగా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. 2001 నుంచి 2002 సంవత్సరంలో ఏఎన్ఎంలను ఉద్యోగులుగా నియమించుకున్న ఒప్పందం చేసిన, రెగ్యులర్ ఉద్యోగులుగా సమానంగా ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇప్పటికే ఏజెన్సీల పేరుతో కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, ఏజెన్సీకి పోయే కమీషన్ కూడా కార్మికులకు పూర్తిగా వచ్చే విధంగా అధికారులు కార్మికులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో గౌతమి, అరుణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

గంజాయి లేకుండా చేయడమే టార్గెట్

- న్యూ ఇయర్ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి
- వార్షిక నేర నివేదిక వెల్లడించిన ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

నూతన సంవత్సరం 2024లో జిల్లాలో గంజాయి లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వార్షిక నేరా నివేధికను ఎస్పీ వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ గతేడాతో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గి మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. జిల్లాలో 2023లో 11 హత్యలు జరగ్గా, ఈ ఏడాది 18 జరిగాయన్నారు. లోక్ అదాలత్‌తో గతం కంటే ఈ సంవత్సరం అధికంగా కేసులు పరిష్కారం అయినట్లు పేర్కొన్నారు. ఎస్ఆర్ఎలు పెరిగాయని, నేరాలు మాత్రం నియంత్రణలో ఉన్నాయని తెలిపారు. 2024లో గంజాయిని అరికట్టడమే లక్ష్యంగా ప్రణాళికలు చేసుకుంటు దానికి అనుగుణంగా పని చేస్తామన్నారు. అదే విధంగా డిసెబర్ 31న పోలీసులు సూచించిన నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 2023 సంవత్సరంలో ప్రమాదాలను నివారించే లక్ష్యంగా పనిచేసిన జిల్లా పోలీసు యంత్రాంగం గణనీయంగా ప్రమాదాలను తగ్గించగలిగిందని తెలిపారు. జిల్లాలో మహిళలపై జరుగు నేరాల సంఖ్య తగ్గుముఖం కావడంలో షీటీం బృందాల కృషి ఎంతగానో దోహదపడిందని తెలిపారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా మత్తుపదార్థాల నిర్మూలనకై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీ చేస్తూ జిల్లాలో ఎటువంటి గంజాయి లాంటి మత్తుపదార్థాలు లభించకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ నేరాల్లో నమోదైన కేసుల వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో డీఎస్పీ ఉమేందర్, ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ ఉన్నారు.

అర్హతలేని ఉన్నతాధికారుల సీసీలను తొలగించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఎటువంటి అర్హతలు లేకుండా జిల్లాలోని ఉన్నతాధికారులకు అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సీసీలను తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు టీకానంద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్‌లో పనిచేసే వ్యక్తులను కొందరు అధికారులు సీసీలుగా నియమించుకున్నారన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే అవుట్ సోర్సింగ్ సీసీలని తొలగించి రెగ్యులర్ విధులు నిర్వహిస్తున్న అధికారులను సీసీలుగా నియామించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం, శ్రావణి, జిల్లా సహాయ కార్యదర్శి వడ్లురి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆటో పల్టీ..పలువురికి గాయాలు

నవతెలంగాణ-కెరమెరి



వ్యక్తిని తప్పించబోయే ఆటో పొలిటీ కొట్టిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కేస్లాగూడ గ్రామానికి చెందిన పలువురు మహిళలు పత్తి తీసేందుకు మెట్ట పిప్రి గ్రామానికి వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో మండల కేంద్రంలో ఓ వ్యక్తిని తప్పించబోయి ఆటో పోలిటీ కొట్టింది. ఈ సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. విజయ లక్ష్మి అనే మహిళకు చేయి ప్యాక్చర్ అయింది. మరో మహిళ కమల బాయిపై ఆటో పడిపోవడంతో కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, స్వల్ప గాయాలైన వారికి చికిత్స అందించారు. కాగా మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని రిమ్స్‌కు ఇక్కడి వైద్యులు రిఫర్ చేశారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

టీజీబీ బ్యాంక్ అందిస్తున్న సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తాడిహత్నూర్ టీజీబీ బ్రాంచ్ మేనేజర్ ఆంబోతు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మరప్పగూడ గ్రామపంచాయతీలో కళాజాత ద్వారా ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల సేవలను వివరించారు. బ్యాంక్ ద్వారా అందించే భీమా పథకాలు, క్రాప్ లోన్, డ్వాక్రా మహిళ సంఘాల రుణాల సద్వినియోగంపై అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలు చెల్లించిన వారికి కొత్త రుణాలు మంజూరు చేస్తామని సూచించారు. రుణాలను సక్రమంగా తీసుకొని సమయానికి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సునీల్, సీఎస్‌సీ నిర్వహకులు ఫడ్ రవీందర్, గ్రామపటేల్ పూసం జాలింశావ్, గ్రామపెద్దలు కుమ్ర రాహుల్, ఐకేపీ సిబ్బంది వాగ్మారే గోవింద్ ఉన్నారు.

బీమాకోరేగావ్ శౌర్య దివస్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

జిల్లా కేంద్రంలో కైలాస్‌నగర్‌లో జనవరి 1న తలపెట్టిన శౌర్య దివస్‌ను విజయవంతం చేయాలని అంబేద్కర్ అసోసియేషన్ మండల ఉపాధ్యక్షులు కాంబ్లె ప్రజ్ఞశీల్, అడ్వొకేట్ కొమ్ము విజయ్ కోరారు. శుక్రవారం శౌర్య దివస్ పోస్టర్‌ను ఉట్నూర్ మండల కేంద్రంలో విడుదల చేశారు. అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీమాకోరేగావ్ శౌర్య దివాస్ సందర్భంగా అమరవీరులకు గౌరవవందన, ప్రముఖ గాయకులచే సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 1818 జనవరి 1 నాడు పూణేలోని బీమాకోరేగావ్ గ్రామంలో ఐదువందల మంది మహర్ సైనికులకు పీస్వాలకు మధ్య దళితుల ఆత్మగౌరవ కొరకు జరిగిన భీకర యుద్ధంలో మహర్ సైనికులు విజయం సాధించారని, అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బీమాకోరేగావ్ అమరవీరులకు నివాళులర్పించేవారని బహుజనులంతా తమ ఘనమైన చరిత్రను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలసంక్షేమ సంఘం మండల అధ్యక్షులు బొంకంటి సుభాష్, దళిత నాయకులు దావుల రమేష్, మాజీ ఆర్మీ జవాన్ వావల్కర్ సుభాష్, మైనారిటీ యువ నాయకులు హకిమ్ పాల్గొన్నారు.

సొనాలలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామంలో పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చైర్మెన్ గాజుల పోతన్న శుక్రవారం వృద్ధులకు స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మెన్ గాజుల పోతన్న మాట్లాడుతూ సంఘ సంస్కర్త మానవతావాది బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకొని ఆయన స్ఫూర్తితో పేదలకు సాయం చేశామని అన్నారు. సొసైటీ ద్వారా రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని సాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి రమేష్ బత్తుల, ఉపాధ్యక్షులు తుమ్మ శ్రీధర్, కార్యదర్శి అమృత్‌రావు పాటిల్, సభ్యులు కొల్లూరి అనిల్, అమ్రే సాయి, బాశెట్టి రమేష్, కసిరే పోతన్న, విజయ్ భాస్కర్, పాముల అనిల్, సభ్యులు, సోన్న హరీష్, మచ్చేందర్, జక్కుల రవి, శీను, కడారి రమణ పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కుటుంబరావు అన్నారు. ఉపాధిహామీ చట్టంలో భాగంగా ఏప్రిల్ 2022 నుండి మార్చి 2023 వరకు సంవత్సరం కాలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై ప్రజావేదికను నిర్వహించడం జరుగుతుందన్నారు. సిబ్బంది పూర్తి నివేధికలతో సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన ఆదేశించారు. అదే విధంగా మున్ముందు చేపట్టే కార్యక్రమాలపై సూచనలు చేయడం జరుగుతుందన్నారు.

ఎన్నికల సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాస్, అడె ప్రకాశ్ లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో సెక్టర్ ఆఫీసర్లకు, ఈవీఎం నందు కమిషనింగ్ చేసిన సిబ్బందికి, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పనిచేసిన సిబ్బందికి, రూట్ ఆఫీసర్లకు, పారిశుద్ధ కార్మికులకు, నేటి వరకు రెమ్యూనరేషన్ చెల్లించలేదన్నారు. వెంటనే చెల్లించే విధంగా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.

కాగజ్‌నగర్ మున్సిపల్ అవిశ్వాసంపై అనిశ్చితి

- నోటీసు అందించి పది రోజులు కావస్తున్నా ఖరారు కాని తేది
- ఎప్పుడు పెట్టినా తమదే విజయమని ఇరు గ్రూపుల ధీమా

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్‌లపై మెజార్టీ కౌన్సిలర్‌లు అందించిన అవిశ్వాస నోటీసుపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన జారీ కాలేదు. దీనితో మున్సిపాలిటీలో అనిశ్చితి నెలకొంది. ఎపుడు అవిశ్వాస సమావేశం నిర్వహించినా తమదే విజయమంటూ ఇప్పటికీ రెండు వర్గాలు ధీమా వ్యక్తం చేస్తుండడం ఇక్కడ గమనార్హం. కాగా ప్రత్యేక ఆర్డీఓ సురేష్‌ను నియమిస్తు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగజ్‌నగర్ మున్సిపల్ ఛైర్మెన్ సద్దాం హుస్సేన్, వైస్ ఛైర్మెన్ రాచకొండ గిరీష్ కుమార్‌లపై ఈ నెల 20న మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసును జిల్లా రెవెన్యూ అధికారికి అందించిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి పురోగతి లేకపోగా మున్సిపాలిటీలో మాత్రం రాజకీయాలు వేడెక్కాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు చెట్టాపట్టాలేసుకొని తిరిగిన మున్సిపల్ ఛైర్మెన్ సద్దాం హుస్సేన్, మాజీ ఎమ్మెల్యే కోనప్పల మధ్య ఇపుడు వైరం పెరిగింది. అవిశ్వాసం వెనుక మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హస్తం ఉందనే అనుమానాన్ని ఛైర్మెన్ వ్యక్తం చేస్తూనే ఇక నుండి తన పోరాటమంతా మాజీ ఎమ్మెల్యే కోనప్పపైనేనని ప్రకటించారు. ఇప్పటి వరకు బీఆర్‌ఎస్‌కు ఏకపక్షంగా ఉన్న మున్సిపల్ పాలకవర్గం ఇపుడు రెండు వర్గాలుగా చీలింది.

పది రోజులైనా..

మెజార్టీ కౌన్సిలర్లు డీఆర్‌ఓ సురేష్‌కు అవిశ్వాస నోటీసు అందించారు. ఇప్పటి వరకు అవిశ్వాస సమావేశానికి సంబంధించి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు జారీ కాలేదు. కనీసం సంతకాల ధృవీకరణకు సంబంధించి కూడా ఉత్తర్వులు వెలువడలేదు. అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేసిన కౌన్సిలర్ల సంతకాలను రెవెన్యూ ఉన్నతాధికారులు ధృవీకరించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ కూడా ఇప్పటి వరకు మొదలు కాలేదు. దీనిపై కాగజ్‌నగర్ ఆర్డీఓ కె.సురేష్‌ను సంప్రదించగా జిల్లా కలెక్టరేట్ నుండి ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు.



అవిశ్వాసం నెగ్గాలంటే 21, వీగాలంటే 11..

మున్సిపాలిటీలో 30 వార్డులున్నాయి. ఇందులో అవిశ్వాస నోటీసుపై 24 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. ఇద్దరు బీఎస్పీ కౌన్సిలర్లు పోను, బీఆర్‌ఎస్‌కు చెందిన వారు 22 మంది ఉన్నారు. సంతకాలు చేసిన కౌన్సిలర్లు అంతా అవిశ్వాస సమావేశం నాటికి ఒకే తాటిపై ఉంటే ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్‌లపై అవిశ్వాసం నెగ్గడం కష్టమేమీ కాదు. ఇదే ధీమాను అవిశ్వాస నోటీసు అందించిన కౌన్సిలర్ల వర్గం వ్యక్తం చేస్తోంది. మరోపక్క అవిశ్వాసం వీగాలంటే కేవలం 11 మంది సభ్యుల అవసరం. ఇప్పటికే అవిశ్వాస నోటీసుపై ఆరుగురు సభ్యులు సంతకాలు చేయలేదు. వీరితో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యునిగా స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు ఓటు హక్కు ఉంటుంది. ఇపుడున్న పరిస్థితులలో ఆయన మున్సిపల్ రాజకీయాలలో జోక్యం చేసుకుంటారా లేదా అనేది తెలియని పరిస్థితి. అయినా ఛైర్మెన్ సద్దాం హుస్సేన్ మాత్రం అవిశ్వాసం వీగిపోయేంత కౌన్సిలర్ల మద్దతు తనకు ఉందని, తాను ఖచ్చితంగా ఛైర్మెన్‌గా కొనసాగుతానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలు అందించాలి

- కలెక్టర్ బొర్కడే హేమంత్



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇటీవల జరిగిన శాసనసభ నియోజకవర్గాల సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను పూర్తిస్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల ఖర్చుల పరిశీలకులు అనునై భాటియాతో కలిసి శాసనసభ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, అభ్యర్థుల ఏజెంట్లు, సహాయ వ్యయ పరిశీలకులు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 30న శాసనసభ నియోజకవర్గాల సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం కోసం చేసిన ఖర్చుల వివరాలను అందించాలన్నారు. జిల్లాలోని సిర్పూర్‌లో 13 మంది, ఆసిఫాబాద్‌లో 17 మంది అభ్యర్థులు పోటీ చేశారని తెలిపారు. వీరు వారి ఖర్చుల వివరాలను 2 రోజుల లోగా సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ కమిటీకి అందించాలన్నారు. పార్టీలు అందించిన నిధులను పార్టీల ఖర్చులు, అభ్యర్థుల సంబంధిత ఖర్చులను అభ్యర్థుల ఖర్చులలో చూపించాలని, ఇట్టి వివరాలను భారత ఎన్నికల సంఘానికి పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కెరమెరి

ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెందూర్ మోతీరం అధ్యక్షతన సమావేశం జరిగింది. గ్రామ పంచాయతీలో ప్రజలు ఎందుర్కొంటున్న విద్యుత్, ఉపాధి హామీ, తాగు నీరు, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముకద్దంగూడ సర్పంచ్ లింబాదాస్, కేలీబీ సర్పంచ్ ఆదే నారాయణ్ మిషన్ భగీరథ తాగు నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్ చెప్పారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనలో లోపాలు, సమస్యలు తెలియజేయాలని నోడల్ అధికారి ఆడే ప్రకాష్ కోరారు. కిరవెల్లి ఎంపీటీసీ ఇష్తేకార్ అహ్మద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఝరీ ఉర్దూ మీడియం పాఠశాలతో పాటు కెరమెరి మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో రెండేళ్లుగా ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నాయని సబ్జెక్టు టీచర్లు లేక ఎలా రాణిస్తారని ప్రశ్నించారు. విద్యా వాలంటీర్ల నియామకం కోసం తీర్మాణం చేయాలని కోరారు. రెండు నెలలుగా కోడిగుడ్లు సరఫరా కావడం లేదని, ఖాళీలపై వివరాలు ఇవ్వాలని ఎంపీపీ, జడ్పీటీసీలు అన్నారు. అనంతరం ఎంపీపీ పేందూరు మోతిరాం, జడ్పీటీసీ సెడ్మాకి దృతబాయి మాట్లాడుతూ మారుమూల గ్రామాల సమస్యల పట్ల సర్పంచులు నాలుగేళ్లుగా కృషి చేయడం అభినందనీయమన్నారు. సర్పంచుల పదవీకాలం పూర్తి కానున్న నేపథ్యంలో సర్పంచులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మహేందర్, సూపరింటెండెంట్ సుధాకర్, ఏఓ గోపికాంత్, ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పెందూర్ మోతిరాం

అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి



ఆసిఫాబాద్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ అరిగెల నాగేశ్వర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పాలన దరఖాస్తుల కార్యక్రమాన్ని ప్రకడ్బందిగా చేపట్టాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం మండలంలోని దాంపూర్, చిర్రకుంట, సాలెగూడ, ఎల్లారంతో పాటు పట్టణంలో ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల అందరికీ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పోచయ్య, ఎంపీడీఓ శశికల, ఎంపీఓ ప్రసాద్, ఏపీఓ చంద్రశేఖర్, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

దహెగాం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఐదు గ్యారెంటీల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డీఓ సురేష్ అన్నారు. మండలంలోని బీబ్రా, కొత్మీర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కార్యాలయాల చుట్టూ తిప్పకుండా అధికారులనే గ్రామాలకు పంపించే ఏర్పాట్లు చేశారన్నారు. జనవరి 6 వరకు ఆయా గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరు వివిధ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దరఖాస్తులు స్వీకరించే ప్రదేశాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ రాజేశ్వర్ గౌడ్, ఆర్ఐలు శృతి, నాందేవ్, ఏపీఎం చంద్రశేఖర్, ఏపీఓ కల్పన, ఏఈ రవీందర్ పాల్గొన్నారు.

రెబ్బెన : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జుమ్డి సౌందర్య ఆనంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని తుంగెడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని డీసీఓ ఒమర్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరు గ్యారెంటీల పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరు గ్యారెంటీలు మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం ప్రతి ఒక్కరు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుంగెడ గ్రామ సర్పంచ్ డోంగ్రి పెంటయ్య, రెబ్బెన ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ బుచ్చన్న, ఉప సర్పంచ్ సాయికృష్ణ, మాజీ సర్పంచ్ భగవాన్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



దహెగాంలో ప్రజాపాలన గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ సురేష్

మరుగుదొడ్ల బిల్లులపై విచారణ చేపట్టాలి



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని కొంచవెల్లి గ్రామంలో స్వచ్ఛభారత్ మిషన్ క్రింద మంజూరైన మరుగుదొడ్లపై విచారణ చేపట్టి లబ్ధిదారులకు న్యాయం చేకూర్చాలని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019-20 వరకు కొంచవెల్లిలో 296 మరుగుదొడ్లు పూర్తయి డబ్బులు చెల్లించినట్టు రికార్డుల్లో ఉందన్నారు. కానీ పూర్తికానీ వాటికి కూడా పూర్తయినట్టు రికార్డులు సృష్టించి కేవలం రంజిత్ అనే వ్యక్తి పేరుపై రూ.5.70 లక్షలు తీసుకున్నట్టు ఆరోపించారు. గ్రామ పంచాయతీలో లబ్ధిదారులకు బిల్లులు చెల్లించకుండా గ్రామ పంచాయతీకి సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వాహా చేశారన్నారు. దీనిపై ఉన్నత అధికారులు స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మామిడి భీమేష్, బోయినిపెల్లి సాయికృష్ణ, కాసనగొట్టు వెంకన్న, తామెర మల్లేష్, చపిడె సంజీవ్, సురేష్‌గౌడ్, విలాస్, సంతోష్ పాల్గొన్నారు.

అనారోగ్య సెలవులు పెంచుతూ సర్క్యులర్ జారీ చేయాలి

- టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు



నవతెలంగాణ-రెబ్బెన

జేబీసీసీఐలో జరిగిన ఒప్పందాలకు అనుగుణంగా సింగరేణిలో అనారోగ్య సెలవులు అమలుచేస్తూ సర్క్యులర్ అమలుచేయాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం గోలేటిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేబీసీసీఐ ఒప్పందంలో కార్మికులకు అనారోగ్య సెలవుల విలువ 120 నుండి 150కి పెంచడం జరిగిందని, దానికి అనుగుణంగా సింగరేణిలో కొత్త సంవత్సరం నుండి అమలుచేస్తూ సర్క్యులర్ జారీ చేయాలన్నారు. 31తో సంవత్సరం మారుతున్నందున కొత్త సంవత్సరంలో వచ్చే 15 వృథా అయ్యే అవకాశం ఉందని, కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎల్‌టీసీలను పెరిగిన ధర రూ.12 వేలకు బదులు రూ.15 వేలు చెల్లించే విధంగా సర్క్యులర్ జారీ చేయాలన్నారు. సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా నాయకులు మాస్కు సమ్మయ్య, మారిన వెంకటేశ్వర్లు, నలగొండ సదాశివ్ పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీ కార్మికుల రేట్లను పెంచాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సివిల్ సప్లై హమాలీ కార్మికుల రేట్లు క్వింటాల్‌కు రూ.40కు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి.దివాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లై గోదాంలో హమాలీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాల నుంచి హమాలీ కార్మికులు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారన్నారు. తక్కువ కూలీతో నిత్యం పేద బడుగుబలహీన వర్గాలకు నిత్యావసర వస్తువులు అందించడంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. డిసెంబర్ 31తో వీరి అగ్రిమెంటు ముగిస్తుందన్నారు. జనవరి ఒకటి నుంచి నూతన రేట్లను క్వింటల్‌కు ఎగుమతి, దిగుమతి రూ.40 పెంచాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ. ఆరు వేల పెన్షన్ చెల్లించాలని, ప్రమాద భీమా రూ.20 లక్షలు, రిటైర్మెంట్ రూ.10 లక్షలు, సొంత ఇంటి పథకం అమలు చేయాలన్నారు. కరోనా సమయంలో హమాలీ కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రెడ్ జోన్లలోకి వెళ్లి పని చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు నూతన రేట్లు పెంచాలని లేనిపక్షంలో ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్, కార్మికులు ఎల్.దివాకర్, మోహన్, శ్రీనివాస్, కొమురక్క, తూకారం పాల్గొన్నారు.

నేడు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-బెజ్జూరు

మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్టు తహసీల్దార్ భూమేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 24 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఎన్నికల కారణంగా చెక్కుల పంపిణీలో ఆలస్యం అయిందన్నారు. పంపిణీ కార్యక్రమంలో అధికారులు, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఆరు గ్యారంటీలపై కళాజాత ప్రదర్శన

నవతెలంగాణ-హాజీపూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. మంచిర్యాల మున్సిపాలిటీలోని 15,16 వార్డులలో కళాకారులు ప్రజలకు ఆటపాటల ద్వారా పథకాలను వివరించారు. జనవరి 6 వరకు ప్రజా పాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వాళ్లందరికీ ఆరు గ్యారంటీ పథకాలను అందిస్తుందని ప్రజలు దరఖాస్తూ చేసుకొని రసీదు పొందాలని పాటల రూపంతో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు లావుడ్యా రమేష్, ముల్కల్ల మురళి, మామిళ్ళ లచ్చన్, వెళ్తూరు పోశం, కొప్పర్తి రవీందర్, బీరుపూరి శ్రీనివాస్, సల్లూరి కిష్టయ్య, రామటెంకి రాజా తిరుపతి, గోడిసేలా క్రిష్ణ, లింగపల్లి రాజేష్, నాగలక్ష్మి, సంధ్య మిట్టపల్లి, నిరోషాయాదవ్ పాల్గొన్నారు.

భారత్ గౌరవ్ సమ్మాన్ పురస్కార్‌కు ఎంపిక

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



జ్యోతి నగర్‌కు చెందిన న్యాయవాది డా. రాజలింగు మోతె భారత్ గౌరవ్ సమ్మాన్-2023 అవార్డుకు ఎంపికయ్యారు. సంఘసంస్కర్త, సమాజ ప్రభావశీలుడుగా ధృవీకరణ పత్రాన్ని ఆయన అందుకున్నారు. పట్టణంలోని సంఖ్యత కేంద్రం కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు కలువల సతీష్ కుమార్, శ్రీరాంపూర్ డివిజన్ బీఎంఎస్ నాయకులు అవునూరి రమేష్, పట్టణ దళిత నాయకులు మంతెన మధు పురస్కర గ్రహీతను సన్మానించారు. అనంతరం రాజలింగు మాట్లాడుతూ ఈ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు

కొనసాగుతున్న ప్రజా పాలన గ్రామ సభలు

నవతెలంగాణ-జైపూర్

మండలంలో గ్రామ పంచాయతీల వారిగా ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు నర్వ, టేకుమట్ల, షెట్‌పల్లి, గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు జరిగాయి. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీల అమలుకు సంబంధించి గ్రామీణుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామ పంచాయతీల సర్పంచుల అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామ సభలో ముందుగా ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించారు. అనంతరం కుటుంబాల వారిగా అర్హులైన వారి నుండి ధరఖాస్తులు స్వీకరించారు. గ్రామ పంచాయతీల వారిగా నియమితులైన అధికారులతో పాటు ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్, సర్పంచులు రాజకుమార్, గోనె సుమలత నర్సయ్య, మేడి రవిల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, తహసీల్దార్ రమేష్, ఎంపీఓ అనిల్ కుమార్, అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

భీమారంలో...

మండల కేంద్రంతో పాటు ఖాజీపల్లి, కొత్తపల్లి, మద్దికల్ గ్రామ పంచాయతీల్లో ప్రజా పాలన గ్రామ సభలు కొనసాగాయి. ఎంపీడీఓ శ్రీనివాస్ రావుతో పాటు తహసీల్దార్ విశ్వంబర్ గ్రామ సభల ద్వార ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించడంతో పాటు అర్హులైన వారు



జైపూర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

ఐదు గ్యారంటీ పథకాలు పొందేందుకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభల్లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు లేకపోయినా ధరఖాస్తు చేసుకోవచ్చు

ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ పథకాలకు ధరఖాస్తు చేసుకునే వారికి రేషన్ కార్డు లేకపోయినా అర్హత పొందిన పథకానికి అర్జీ పెట్టుకోవచ్చునని అధికారులు సూచించారు. ఆదరబాదరగా కాకుండా పూర్తి సమాచరంతో వచ్చే నెల 6 వరకు అర్జీలు పెట్టుకోవడానికి అవకాశం ఉన్నందున గ్రామీణులు తొందరపడవద్దని కోరారు. ధరఖాస్తు దారులు తమ అర్జీని సమర్పించిన వెంటనే అధికారి నుండి రశీదు స్వీకరించాలన్నారు.

కాసిపేట : మండలంలోని కాసిపేట, ముత్యంపల్లి, కోమటిచేను, బుగ్గగూడెం గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలను నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ముందుగా ఎంపీడీఓ ఎంఏ అలీం ప్రజా పాలన గ్రామ సభలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గంగారాం, తహసీల్దార్ బోజన్న, సర్పంచులు ఆడె బాదు, రాంటెంకి శ్రీనివాస్, దరావత్ దేవి, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, ఎంపీఓ నాగరాజు, హెచ్ఎంలు రాథోడ్ రమేశ్, సుధాకర్ నాయక్, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాసిపేటలో..

పీహెచ్‌సీని సందర్శించిన జాతీయ తనిఖీ బృందం



నవతెలంగాణ-హాజీపూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జాతీయ నాణ్యత ప్రమాణాలు ధృవీకరణ కోసం జాతీయ స్థాయి ప్రత్యేక బృందం సందర్శించింది. ఈ బృందంలో డాక్టర్ సుప్రియ, డాక్టర్ సరస్వతి ఇతర అధికారులు పీహెచ్‌సీలోని ఓపీ సేవలు, ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ, ప్రయోగశాల, సాధారణ పాలన పరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీ బృందం పీహెచ్‌సీ వస్తుందనే నేపథ్యంలో గురువారం నుండే ఆస్పత్రి రూపురేఖలు మారి పోయాయి. ముగ్గులు, మొక్కలతో ఆస్పత్రిలో ఎన్నడూ లేని విధంగా సుందరంగా ముస్తాబు చేశారు. ఎప్పుడు ప్రాంగణం చెత్తచేదారంతో నిండి ఉండేది. ఒక రోజు వ్యవధిలోనే ఆస్పత్రి శుభ్రం కావడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సుబ్బారాయుడు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విజయ పూర్ణిమ, ఫయాజ్ ఖాన్, నీరజ, మండల వైద్యాధికారి లహరి పాల్గొన్నారు.

రేపు ఎడ్ల పందాలు

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట్ గ్రామంలో ఆదివారం ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తిప్పని మహేష్ తెలిపారు. గుడిపేట్ గ్రామ శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద పాత గుడిపేట్‌లో కిలోమీటర్ దూరంలో ఈ పోటీలుంటాయన్నారు. ఉత్సాకులు, పోటీలో పాల్గొనే వారు ఉదయం 9 గంటలలోపు వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 96666369905, 9652596586ను సంప్రదించాలని కోరారు. మొదటి బహుమతి 3 గ్రాముల బంగారం, రెండవ బహుమతి రూ.5 వేలు, మూడవ బహుమతి రూ.3 వేల నగదు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేతుల మీదుగా అందించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఆవిష్కరించారు. అనంతరం కళాశాలలో మద్యం, డ్రగ్స్, మత్తు పానీయాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్ హాజరై మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి కఠిన శిక్షాలుంటాయన్నారు. జీవితంలో కష్టాలను అధిగమిస్తూ ముందుకు సాగాలన్నారు. యువత జీవితాన్ని నాశనం చేసుకోకుండా, విద్య, ఉపాధి తదితర అంశాలపై దృష్టి సారించి భవిష్యత్‌లో మంచి ఉన్నత స్థాయిలో ఉండాల నిసూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు బండ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ విజిత్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయాస్తం 6 గ్యారంటీ స్కీంలను అమలు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజల వద్దకే అధికారులను పంపి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి పేదోడికి ప్రభుత్వ పథకాలు అందేల చూస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలకు ఏమి చేయలేదని ఆరోపించారు. ప్రతిపక్షాలు, అధికారులు, పాలక పక్షాలు సమన్వయంతో పని చేసినప్పుడే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నించాలని, పాలక పక్షం పని చేసి చూపించాలన్నారు. ఆరు గ్యారెంటీ స్కీంలలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు చెందకుండా జనవరి 6 వరకు తమ దరఖాస్తులను చేసుకోవచ్చని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, తహసీల్దార్ వేణుగోపాల్, సర్పంచి జక్కు భూమేష్, పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, నాయకులు మోహన్ రెడ్డి, ముత్యం రాజన్న, మత్య శంకరయ్య, మిక్కిలినేని రాజశేఖర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్, దుమల రమేష్, మామిడిపల్లి ఇంద్రయ్య, దాముఖ కరుణాకర్, ఇసాక్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫసిఉల్లా, సుధాకర్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యం సతీష్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సోహెల్ అహ్మద్, బీరవేణి రాజన్న యాదవ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన అధికారులు..

మండలంలోని తిమ్మాపూర్, మురిమడుగు, ఇంధన్‌పల్లి గ్రామాల్లో ఎంపీడీఓ అరుణాని, తహసీల్దార్ వేణుగోపాల్, పీఈఓ రమేష్ అభ హస్తం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. సిబ్బందితో పాటు ప్రజలకు పలు సూచనలు చేశారు. తిమ్మాపూర్, మురిమడుగు, ఇంధన్‌పల్లి సర్పంచులు జడి గంగాధర్, భాగ్యలక్ష్మి రాజలింగు, కంటెం సునీత శంకర్, కార్యదర్శులు చంద్రమౌళి, జంగు, లావణ్య పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల కోసం ఏర్పాటు చేసినా ప్రజాపాలన కార్యక్రమం మండలంలోని బిర్సాయిపేట గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని, ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి ఈ పతకాలు అందేలా అధికారులు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధులు పత్రికలే

- ప్రెస్‌క్లబ్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులు పత్రికలేనని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా క్యాలెడర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్ల నిర్మాణాలపై వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో ప్రింట్ మీడియా విలేకరులకు ఇంటి స్థలాలతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యేను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నరసయ్య కోరారు. ప్రెస్ భవనం అసంపూర్తిగా ఉందని రూ. ఐదు లక్షల కేటాయించాలని విన్నవించడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి విలేకరుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి గాజుల లింగన్న గౌడ్, గౌరవ అధ్యక్షులు మందపల్లి కాంతయ్య, కోశాధికారి షీలా చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శి జాడి వెంకటయ్య, సంయుక్త కార్యదర్శి సత్యం, అమరగొండ సతీష్, కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముసఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, పార్టీ నాయకులు రాజశేఖర్, దాముఖ కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపైనే పోరాటం : మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-హాజీపూర్

ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపైనే పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. శుక్రవారం వేంపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తూ ఓటమికి ఏ మాత్రం కుంగిపోకుండా నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. 4 పర్యాయాలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేశానని పేర్కొన్నారు. తాను గతంలో తీసుకువచ్చిన అభివృద్ధి పనులే ఇప్పుడు నియోజకవర్గ పరిధిలో జరుతున్నయన్నారు. గతంలో కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 324 సర్వే నంబర్‌లో అవినీతి జరిగిందని, ఎకరాల భూమి కబ్జాకు గురైందని ఆరోపించారు. ఇపుడు అధికారం వారి చేతుల్లోనే ఉందని ఆ సర్వే నంబర్ అవినీతిని బయటకు తీయాలని సవాల్ చేశారు. 20 ఎండ్లు ఎమ్మెల్యేగా ప్రజలకు జవాబుదారీగా పనిచేశానని తెలిపారు. రాబోవు ఏడాది ఎన్నికల కాలం కాబట్టి పార్టీ శ్రేణులు గత జ్ఞాపకాలను మార్చి ప్రతి ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. పార్టీ మారిన అవకాశ వాదులకు గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట్, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మెనులు కాంతయ్య, పెంట రాజయ్య, ప్రభాకర్, నడిపెల్లి విజిత్ రావు, మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, గాదె సత్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు



నవతెలంగాణ-బోథ్

డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను శుక్రవారం బోథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మల్లెపూల సత్యనారాయణ, పోచ్చెర సర్పంచ్ బూరుగుల మల్లేష్, హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పరిస్థితులను, రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన డిప్యూటీ సీఎం, సీఎంతో చర్చించి వచ్చే బడ్జెట్ సమావేశంలో బిల్లు ప్రవేశ పెట్టేందుకు హామ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకుడు నల్ల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ప్రజాధనం వృథా



ప్రాజెక్టు సందర్శనలో మంత్రులతో ఎమ్మెల్యే గడ్డం వివేక్

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్-మంథని సరిహద్దుల్లో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో గత ప్రభుత్వం ప్రజా ధనం వృథా చేసిందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. శుక్రవారం రాష్ట్ర మంత్రులతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు ఆయన సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌లో లోపాలున్నాయని ఆయ పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పట్ల మొదటి నుండి వ్యతిరేకతలు ఉన్నప్పటికి కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడ ప్రాజెక్టును నిర్మించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో పెద్దపల్లి మాజీ ఎంపీ సీడబ్ల్యూసీ మెంబర్ గడ్డం వెంకటస్వామి ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం కృషి చేశారని గుర్తు చేశారు. రూ. 38 వేల కోట్లతో 152 మీటర్ల ఎత్తుతో ప్రభుత్వం ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినప్పటి నుండి చెన్నూర్ నియోజకవర్గం పరిధిలో గల చెన్నూర్, కోటపల్లి, జైపూర్ మండలాల శివారుల్లో వందల ఎకరాల్లో వ్యవసాయ భూములు నీట మునుగుతున్నాయన్నారు. నాలుగు సంవత్సరాలుగా కళేశ్వరం బ్యాక్ వాటర్ కారణంగా గోదావరి తీరంలో రైతులు పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. బాధితులకు న్యాయం చేయడం కోసం ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవడంతో పాటు బ్యాక్ వాటర్ ఇబ్బందులు శాశ్వతంగా పరిష్కరించాలని మంత్రులను కోరారు. అనంతరం మంత్రులను ఆయన సన్మానించారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-కాసిపేట

ఎన్ఏసీ(న్యాక్), ఈజీఎంఎం-డీడీయూజీపై వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 3 నెలల ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ న్యాక్, ఆదిలాబాద్ నాగేంద్రన్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రికల్ అండ్ హౌజ్ వైరింగ్, 10వ తరగతి ఫెయిల్ లేక పాస్ అయిన వారికి ప్లంబింగ్ అండ్ సానిటేషన్‌పై శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు గల యువత అర్హులని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హస్టల్ వసతి, బుక్స్, యూనిఫాం, షూస్, హెల్మెట్ అందిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, అర్హత సర్టిఫికెట్, కులధృవీకరణ పత్రాల జిరాక్స్, పాస్‌ఫోటోలు5 తీసుకోని ఐటీడీఏ, వైటీసీ బిల్డింగ్, తాళ్లగురిజాలరోడ్, సోషల్ వేల్ఫేర్ స్కూల్ బెల్లంపల్లి సమీపంలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 8328507232, 99661100452లో సంప్రదించాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నవతెలంగాణ-జైపూర్

గ్రామీణుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారులు సూచించారు. భారత్ వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భీమారం మండల కేంద్రంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, సర్పంచ్ గద్దె రాంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహణ కల్పించారు. ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్న యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి భీమా తదితర పథకాల ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా ఈ పథకాల ద్వార ప్రయోజనం పొందిన ప్రజల మనోభావాలను అడిగి తెలుసుకున్నారు.



టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ.స్వామి, జిల్లా కార్యదర్శి శ్యామ్ అధ్యక్షతన మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా భగత్ బాపూరావ్, ప్రధాన కార్యదర్శులుగా ఎం.రాజేందర్, ఉపాధ్యక్షులుగా ఆర్.జ్ఞానేశ్వర్, కే.లక్ష్మి, కోశాధికారిగా ఆర్.మనోజ్, కార్యదర్శులుగా ఎస్‌కె అశ్రాఫ్, సోనేరావు, సుకుమార్, గంగామణి, ఆడిట్ కన్వీనర్ పి.మల్లయ్య, సోషల్ మీడియా కన్వినర్ ఆర్.అశ్విన్, పత్రికా కన్వినర్‌గా జీవన్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్ యూటీఎఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంబరాలు

రామకృష్ణాపూర్ : రీజినల్ మెడికల్ ఇన్‌చార్జి బత్తుల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఏఐటీయూసీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేజ్‌బోర్డు మెంబర్ సీతారామయ్య హాజరై మాట్లాడారు. కార్మికులు మేనిఫెస్టోను నమ్మి తమ మీద నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించారో వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ, మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సత్యనారాయణ, ఆర్‌కెపి బ్రాంచ్ సెక్రటరీ ఆంజనేయులు, హాస్పిటల్ పిట్ సెక్రెటరీలు, అసిస్టెన్స్ పిట్ సెక్రెటరీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దరఖాస్తుల స్వీకరణను పరిశీలించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్ : ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణను ఎమ్మెల్యే పాయల శంకర్ శుక్రవారం వార్డు నంబర్ 48 ద్వారకనగర్‌లో పరిశీలించారు. ప్రక్రియ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి దరఖాస్తు ఫారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల వరకే పార్టీలు ఉంటాయని, గెలిచిన తరువాత ప్రజల కోసమే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం అభయ హస్తం ద్వారా ఆయా పథకాల అమలు కోసం దరఖాస్తులను స్వీకరిస్తుందన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్ కార్డు లేదని, తాము అర్హులం కాదనే భావన వద్దన్నారు. ప్రతి ఒక్క పేద అర్హుడని తెలిపారు. అందరికి ఫారాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి సీఈవో రాజేశ్వర్ రాథోడ్, కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, కృష్ణయాదవ్, ముకుంద్ పాల్గొన్నారు.



ఎన్నికల ఖర్చుల వివరాలు అందజేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల ఖర్చుల వివరాలను నిర్దేశించిన నమూనాలో తప్పనిసరిగా సమర్పించాలని ఎన్నికల ఖర్చుల పర్యవేక్షకుడు శ్రీయాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ అభ్యర్థులు వారి వారి ఎన్నికల ఖర్చుల వివరాలను నిర్దేశించిన నమూనాలు నిర్దేశించిన రిజిస్టర్‌లలో రసీదులతో సహా వారు ఉపయోగించిన బ్యాంక్ అకౌంట్ నంబర్లతో సహా సమర్పించాలని అన్నారు. లేనిపక్షంలో తదుపరి ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులుగా పరిగణించబడతారన్నారు. ఇప్పటి నుంచి వారం రోజులలో ఈ ప్రక్రియ మొత్తం పూర్తవ్వాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓలు రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల ఖర్చుల సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- పీఏసీఎస్ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి



నవతెలంగాణ-తలమడుగు

ఎరువులు, విత్తనాలు అన్ని వేళల రైతులకు అందుబాటులో ఉంచాలని తలమడుగు పీఏసీఎస్ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘ భవనంలో చైర్మెన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక స్వల్పకాలిక రుణాలతో పాటు ఇతర విషయాల సమీక్షించడం జరిగిందని అన్నారు. రైతులకు అందుబాటులో ఉండి సహకార సంఘం తరపున ఎరువులు, విత్తనాలను అన్నివేళలా అందించేందుకు సిద్ధంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎప్పటికప్పుడు రికార్డులలో ప్రతిదీ రాతపూర్వకంగా ఉండాలని అన్నారు. సిబ్బంది సకాలంలో తమ విధులకు హాజరు కావాలని కోరారు. సమావేశంలో సొసైటీ సీఈఓ మోతే శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రతాప్, లింగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, గంగారాం, నారాయణ, సహకార సంఘ సిబ్బంది సాగర్, గంగయ్య, భీంరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం అదే గ్రామానికి చెందిన చెన్నాల సాయికిరణ్ 150 మంది విద్యార్థులకు తన సొంత డబ్బులతో నోట్ బుక్స్ పెన్నులు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాత సాయికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు అందరం అండగా నిలువాలని అన్నారు. విద్యాదానం కోసం కలిసికట్టుగా గ్రామస్తులు తమ వంతు సహకారాన్ని అందించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సాగర్, గ్రామస్తులు ఉడుగు నరేష్, నక్క వంశీ, బొజ్జ మహేష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటీ షోరూం ప్రారంభం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో అమీనా ఎలక్ట్రిక్ స్కూటీ షోరూమ్‌ను శుక్రవారం నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం యాజమాని అయిన కాంగ్రెస్ నాయకులు షేక్ వసీముద్దీన్, షేక్ షఫీయుద్దీన్ శ్రీహరిరావుకు శాలువా కప్పి సన్మానించారు. శ్రీహరిరావు స్కూటీని నడిపి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు

- ఆధార్, రేషన్‌కార్డు ఉంటే సరిపోతుంది
- దరఖాస్తు ఫారాలు విక్రయిస్తే కఠిన చర్యలు
- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు చేసే లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందకూడదని, ఈ నెల 6లోపు ఎప్పుడైనా దరఖాస్తు అందించేందుకు ఆస్కారం ఉంటుందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. దరఖాస్తు సమయంలో రేషన్, ఆధార్‌కార్డు అందజేస్తే సరిపోతుందన్నారు. ఒకవేళ రేషన్‌కార్డు లేకపోయినా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా దరఖాస్తు ఫారాలను రూ.20చొప్పున విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని..ఇలాంటి వ్యవహారాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు మీసేవ లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం ప్రజాపాలన సభలకు సంబంధించి విలేకరులతో మాట్లాడారు. ఒకే దరఖాస్తు ఐదు పథకాలకు వర్తిస్తుందని తెలిపారు. రైతుబంధు తీసుకుంటున్న రైతులు కూడా రైతుభరోసా కోసం దరఖాస్తు చేయాలని, కౌలురైతులు, వ్యవసాయ కూలీలు సైతం అప్లై చేసుకోవాలని సూచించారు. పింఛన్ వస్తున్న వారు మాత్రం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన వారు ఇక్కడ నివసిస్తున్నట్లు ఆధారాలు ఉంటే దరఖాస్తు చేయాలని, ఈ పథకం కోసమే వస్తే మాత్రం చేయకూడదని పేర్కొన్నారు. ముఖ్యంగా దరఖాస్తు ఫారాలు సక్రమంగా నింపాలని..ఇందుకు సహాయం చేసేందుకు ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు వాటిని సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా పాల్గొన్నారు.

ప్రజాపాలన ఏర్పాట్లు పరిశీలించిన ప్రశాంతి

నవతెలంగాణ-నిర్మల్

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా శుక్రవారం ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ప్రశాంతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి మున్సిపాలిటీలోని బాగులవాడా, దిలవార్‌పూర్‌లోని సిర్గాపూర్, రత్నాపూర్ కాండ్లి, మామడ మండలం బండల్ ఖానాపూర్ వార్డ్, గ్రామాలలో పర్యటించి దరఖాస్తుల స్వీకరణ, ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజాపాలన గ్రామ సభ కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభయహస్తం కార్యక్రమంలో ఆరు గ్యారంటీలను అమలు పరచడానికి అర్హులైన ప్రజల నుండి దరఖాస్తులను సేకరించడం జరుగుతుందని, ఈ నెల 28 దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించడం జరిగిందని, జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. పని దినాలలో



ప్రణాళిక ప్రకారం గ్రామాలలో, వార్డులలో ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించి ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రజల నుంచి వివిధ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొనెలా అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతీ ఒక్క పేదవారికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్యేశంతో ప్రభుత్వం స్వయంగా మీ ఊరికి వచ్చిందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ కారణాల వల్ల గ్రామ సభలో దరఖాస్తు చేసుకొని వారు తిరిగి గ్రామ కార్యదర్శికి దరఖాస్తు సమర్పించుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులకు తప్పనిసరిగా రశీదు అందించాలని సంబంధిత అధికారులను సూచించారు. గతంలో ఇక్కడ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పరిశుభ్రత, రహదారుల రూపురేఖలు మారాయని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిఆర్‌ఓ లోకేష్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్, తహసిల్దార్లులు, ఎంపీడీఓలు, రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.



కేసులు పెండింగ్‌లో ఉంచొద్దు : ఏసీపీ మోహన్

నవతెలంగాణ-జైపూర్

కేసులు పెండింగ్‌లో ఉంచొద్దని ఏసీపీ మోహన్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. నమోదవుతున్న గ్రేవ్, నాన్ గ్రేవ్ సీడీ ఫైల్స్ పరిశీలించారు. సిబ్బంది విధులను వాకబు చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన ప్రాపర్టీని కోర్టు అనుమతితో డిస్పోజనల్ చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ లాకప్ రూమ్ పరిశీలించి 5ఎస్ అమలు తీరును పరిశీలించారు. స్టేషనల్‌లో రోజు వారిగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, సెంట్రీ రిలీఫ్ బుక్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రోసెస్ రిజిష్టర్, బీట్ డ్యూటీ బుక్స్, సస్పెక్ట్ చెక్ లిస్టు రిజిష్టర్, సుపీరియర్ ఆఫీసర్స్ విజిటింగ్ బుక్స్, ఫైనల్ రిపోర్ట్స్ తదితర రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా అధికారులకు రెస్ట్ రూమ్ సౌకర్యం, స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెల్సుకున్నారు. రాష్ట్ర సరిహద్దుగా ఉన్న పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులు నమోదవుతున్నాయో పరిశీలించాలని సూచించారు. సిబ్బంది తరచూ గ్రామాలను సందర్శించి నేరాలు జరగకుండా ముందస్తు సమాచారం సేకరించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై ఉపేందర్ ఉన్నారు.





నిర్మల హృదయ సేవాసమితి ఆధ్వర్యంలో డాక్టర్ రామకృష్ణకు సన్మానం

నవతెలంగాణ-నిర్మల్

ఈనెల 28 తేదిన కేరళ సీఎం పినరై విజయన్, ఐఎంఏ మాజీ అధ్యక్షులు శరత్ అగర్వాల్, ప్రస్తుత అధ్యక్షులు అశోకన్ చేతుల మీదుగా ఉమ్మడి జిల్లాలోనే మొట్టమొదటిసారి జాతీయ ఉత్తమ డాక్టర్‌గా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఉదగిరి రామకృష్ణ నేషనల్ ప్రెసిడెంట్ అప్రిసియేషన్ అవార్డును అందుకున్నారు. కాగా నిర్మల హృదయ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో పేద, బడుగు, బలహీన వర్గాల వారికి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు సాదమానంద్, యాటకారి సాయన్న, మూర్తి ప్రభు, బొద్దుల వెంకటరమణ, వీరార్జున్, సుంకరి పోతన్న, గంగాధర్ పాల్గొన్నారు.

అవిశ్వాసాన్ని రద్దు చేయించి, అభివృద్ధికి సహకరించాలి

- ఎమ్మెల్యే బొజ్జుకు వీడీసీ సంఘాల విజ్ఞప్తి



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్‌పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేయించాలని ఖానాపూర్, తిమ్మాపూర్ గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిసి సంయుక్తంగా వినతిపత్రాలను అందజేశారు. ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనటానికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ బీర్నంది గ్రామానికి రాగా, ఖానాపూర్ నుంచి వీడీసీ ఆధ్వర్యంలో బీర్నందికి వెళ్లి ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేసి విన్నవించారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి జరుగుతుందని చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై అవిశ్వాసాలు పెడితే అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ప్రస్తుత పాలకవర్గాన్ని కొనసాగిస్తూ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేయించాలని వారు కోరారు. ఖానాపూర్ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, పట్టణ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తానని అన్నారు. రద్దు చేయడానికి తన వంతు సహకారాన్ని తప్పకుండా అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం వీడీసీ సంఘాల నాయకులు ఆదనపు కలెక్టర్ ఫైజల్‌ను కలిసి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ వీడీసీ అధ్యక్షులు సతీష్‌రావు దేశ్‌పాండే, తిమ్మాపూర్ వీడీసీ అధ్యక్షులు బీసీ రాజన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కల్వకుంట్ల నారాయణ, వీడీసీ సంఘాల నాయకులు మైలారపు గంగాధర్, దేవతి రాజేశ్వర్, వెంకటప్పయ్య, నేత శ్యామ్, మధిర సత్యనారాయణ, పుప్పాల మురళి, కరిపే శ్రీనివాస్, నరపాక నర్సయ్య, వీడీసీల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం కృషి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాఠశాలల్లో మౌలిక వసతులు, సదుపాయాల కొరత ఉందని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం తపస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జిల్లా అధ్యకులు సునీల్ చౌహాన్ అధ్యక్షతన స్థానిక శిశు మందిర్‌లో జరుగగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్స్ పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అన్ని రకాల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు సునీల్ చౌహాన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మధ్యలో ఆగిపోయిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, తక్షణం పెండింగ్ డీఏలు విడుదల చేయాలని అన్నారు. ప్రతి పాఠశాలలో పూర్తిస్థాయి స్కావెంజర్లు నియామకం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తయారుచేసిన నూతన సంవత్సర క్యాలెండర్ 2024 ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సమావేశంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లబోజు గోపికృష్ణ, ఆర్థిక కార్యదర్శి బచ్చువార్ నారాయణ జిల్లా బాధ్యులు మనోజ్‌రెడ్డి బత్తుల గంగాధర్, ప్రకాష్, గోమంత్‌రెడ్డి, యాదవ్ రావ్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజల ముంగిట్లోకి కేంద్ర పథకాలు



నవతెలంగాణ-నిర్మల్

వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజల ముంగిట్లోకి తేవడం జరిగిందని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి ఎల్‌డీఎం కె చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా, శివాజీ చౌక్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాల వివరాలతో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్థానికులతో సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. క్యాలెండర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను సెల్ ఫోన్ ద్వారా స్కానింగ్ చేస్తే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు తెలిసిపోతాయని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.